# లైబ్రేరియన్లు టీచర్ల పరిధిలోకి వస్తారు

## విశ్వవిద్యాలయాల లైబ్రేరియన్ల కేసులో హైకోర్టు తీర్పు

సాక్షి, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల్లో పనిచేసే లైబ్రేరియన్లు టీచర్ల నిర్వచన పరిధిలోకి వస్తారని హైకోర్టు తేల్చి చెప్పింది. 60 ఏళ్ల వరకు లైబ్రేరియన్లు సర్వీసులో కొనసాగేందుకు అర్హులని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్, జస్టిస్ బి.శివశంకరరావు ఇటీవల తీర్పు వెలువరించారు. లైబ్రేరియన్లను నాన్-వెకేషన్ అకాడెమిక్ స్టాఫ్‌గా పరిగణిస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీటికి అనుగుణంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ అబ్దుల్ హకీమ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని తొలుత సింగిల్ జడ్జి కొట్టేశారు. దీనిపై హకీం ధర్మాసనం ముందు మళ్లీ అప్పీల్ చేశారు. దీనిపై తుది విచారణ జరిపిన జస్టిస్ సంజయ్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. చట్ట సవరణల అనంతరం లైబ్రేరియన్ల సర్వీసు నిబంధనల్లో గణనీయ మార్పులు వచ్చాయని ధర్మాసనం తెలిపింది. ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) సిఫారసుల మేరకు ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ విద్యార్థులు లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ కోర్సు చేయడం తప్పనిసరి చేశారని పేర్కొంది. ఈ నేపథ్యంలో లైబ్రేరియన్లను అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పరిగణించడం మొదలుపెట్టారని తెలిపింది. వ్యవసాయ యూనివర్సిటీల చట్టం ప్రకారం టీచర్ నిర్వచన పరిధిలోకి ప్రొఫెసర్లు, రీడర్లు, లెక్చరర్లు, యూనివర్సిటీ నియమించి, గుర్తించిన ఇతర వ్యక్తులు వస్తారని స్పష్టం చేసింది. ఈ పరిస్థితుల్లో లైబ్రేరియన్లు టీచర్ల నిర్వచన పరిధిలోకి వస్తారని తెలిపింది.